సాక్షి
సూర్యాపేట
గురువారం । 23 । మే । 2024



ఉత్సవాలు పరిసమాప్తం
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జయంత్యుత్సవాలు బుధవారంతో ముగిశాయి. - 8లో



వానాకాలం నుంచే..
వానాకాలం నుంచే ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని నల్లగొండ డీఏఓ తెలిపారు. - 8లో

గరిష్టం / కనిష్టం
38°/ 28°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాలిసెట్‌కు ఐదు కేంద్రాలు

సూర్యాపేటటౌన్ : ఈ నెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించే పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.నర్సింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. వీటిలో 2,362 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు 10గంటల వరకు చేరుకోవాలని, 11గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరని పేర్కొన్నారు.

ఎడ్‌సెట్‌కు నాలుగు కేంద్రాలు

నల్లగొండ రూరల్: ఎడ్ సెట్–2024 నిర్వహణకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎడ్‌సెట్ చైర్మన్ గోపాల్‌రెడ్డి తెలిపారు. కోదాడలో మూడు, నల్లగొండలో ఒక కేంద్రంలో మొత్తం 1,100 మంది అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు.

13 మంది ఓపీఓల సస్పెన్షన్

భానుపురి (సూర్యాపేట) : ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన శిక్షణకు హాజరుకాని 13 మంది ఓపీఓ(అదర్‌ప్రిసైడింగ్ ఆఫీసర్)లను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఆయా శాఖలకు చెందిన జిల్లా అధికారులు వివరణ సమర్పించాలని ఆదేశించారు.

632.80 అడుగులకు మూసీ నీటిమట్టం

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 632.80 అడుగులకు చేరుకుంది. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు మూసీలోకి బుధవారం 732 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 632.80 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీ నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 618 అడుగుల కనిష్ఠ స్థాయికి పడిపోగా, గత 48 రోజుల్లో దాదాపు 15 అడుగుల మేర నీరు ప్రాజెక్టులోకి చేరింది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో నీటిమట్టం 642 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.79 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


కాన్పుల సంఖ్య పెంచాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటా చలం

నేరేడుచర్ల : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ కోటాచలం ఆదేశించారు. బుధవారం నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 62శాతం ప్రసవాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీతామహాలక్ష్మి విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులకు సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. మంగళ, బుధవారం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరు కాలేదని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి షోకాజ్ నోటీసులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. చింతలపాలెం, పాలకవీడు మండలాల్లో వైద్యాధికారుల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆయన వెంట నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నాగిని, సౌమ్యశ్రీ ఉన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా పోరాటం



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి, చిత్రంలో సంకినేని వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట : కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, పట్టభద్రుల సమస్యలు నెరవేర్చేదాకా పోరాటం చేస్తానని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రులు తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు భాగ్యారెడ్డి, కర్నాటి కిషన్, ఆబిద్, నర్సింహ, లక్ష్మణ్‌రావు, పరిపూర్ణచారి, శివ, రమేష్, శైలేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

రైతన్నకు బాసట!

- వానాకాలం సీజన్ నుంచే ఉచిత పంటల బీమా అమలు
- ప్రీమియం మొత్తం చెల్లించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- 2.70 లక్షల మందికి ప్రయోజనం కలిగే అవకాశం



రైతులు: 2.70 లక్షల మంది
సాగు భూమి : 6,34,400 ఎకరాలు
వరి సాగు విస్తీర్ణం : 4,65,500 ఎకరాలు
పత్తి సాగు విస్తీర్ణం: 90 వేల ఎకరాలు

భానుపురి (సూర్యాపేట) : ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయనుంది. వానాకాలం సీజన్ నుంచే ఈ పథకాన్ని వర్తింప జేయాలని భావిస్తుండగా.. ఇందుకోసం వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం తదితర వాటితో పాటు పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న పంటల బీమా పథకాలను అధ్యయనం చేస్తోంది. పదేళ్ల కాలంలో పంటల బీమా పథకాలు పక్కాగా అమలు కాక జిల్లావ్యాప్తంగా రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటల బీమా పథకం ఈ సారి అమలు చేస్తే జిల్లాలో దాదాపు 2.70 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.

జిల్లాలో 6.34 లక్షల ఎకరాల సాగు..
జిల్లావ్యాప్తంగా 2.70 లక్షల మందికి రైతులు 6.34 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో వరి సాగు 4.65 లక్షల ఎకరాలు ఉండగా రెండోస్థానంలో పత్తి 90వేల ఎకరాల వరకు ఉంటుంది. ఏటా ఏదో రకంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. గతంలో అమలు చేసిన పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95శాతం ప్రీమియం చెల్లించగా.. మిగిలిన అయిదు శాతాన్ని రైతాంగం భరించేది. ఈ సమయంలో గ్రామం యూనిట్‌గా తీసుకోవడంతో పంటలు నష్టపోయిన కర్షకులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. పరిహారం పొందడంలో సమస్యలు ఉండటం, పెద్దగా ఉపయోగం ఉండటం లేదనే కారణంతో మొదట్లో అమలు చేసిన గత ప్రభుత్వం.. తర్వాత బీమా పథకాన్ని పక్కన పెట్టింది.

పక్కాగా అమలుకు ప్రణాళికలు
కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించనుందని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. అయితే గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు ఇప్పటికే క్లస్టర్లవారీగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణనలోకి తీసుకోనున్నారు. చాలామంది ఈఏఓలు పంట పొలాలకు వెళ్లకుండా రైతులను అడిగి రాస్తుండటం, పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో పంటల నమోదుపై గొడవలు జరుగుతుండటంతో పంటల బీమాను పకడ్బందీగా అమలు చేయాలంటే బయోమెట్రిక్ తీసుకోవడంతోపాటు రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల వారీగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం తదితర వాటికి సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని కోరారు. పంటల బీమాకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించడం, బీమా కంపెనీలను సంప్రదించడం, ప్రీమియాన్ని నిర్ధారించి ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనతో వచ్చే ప్రయోజనాలను వినియోగించుకోవడంతో పాటు రైతులపై ఎలాంటి భారం పడకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



మట్టపల్లి ఆలయంలో సిద్ధమైన కల్యాణ మండపం, చిత్రంలో తరలివచ్చిన భక్తులు

వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో కొనసాగుతున్న తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం యాజ్ఞీకులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు పర్యవేక్షణలో లక్షమల్లికా పుష్పార్చన, ఎదుర్కోలు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీస్వామి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృతాభిషేకం, ద్రవిడ ప్రబంధ సేవాకాలం చేపట్టారు. అనంతరం ధ్రువ స్వామికి మల్లికాపుష్ప సహస్రనామార్చన, గర్భాలయం ముందు లక్షమల్లికా పుష్పపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామిని నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించారు.





మట్టపల్లి ఆలయంలో ఎదుర్కోలు మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అర్చకులు రెండువర్గాలుగా ఏర్పడి శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. మహానివేదన నీరాజనమంత్రపుష్పాలతో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నాదస్వర కచేరీ, భక్తి సంగీతం, సంగీత విభావరి, గజేంద్రమోక్షం హరికథ, శ్రీలక్ష్మీనరసింహనామసంకీర్తనను గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన శ్రీరామతీర్థ సేవాశ్రమం భక్త బృందం చేపట్టింది. రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్ధరాత్రి శ్రీస్వామి వార్లను కల్యాణమండపానికి భక్తుల జయజయధ్వానాల నడుమ అశ్వ, గజ, సింహ, గరుడ, శేష తదితర వాహనాలపై తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పీఓలు, ఏపీఓల బాధ్యతలు కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఓ, ఏపీఓల బాధ్యతలు కీలకమని కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్. వెంకటరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పీఓలు, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్ రమేష్‌తో నిర్వహించిన శిక్షణ తరగతులకు అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27వ తేదీ ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 51,497 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, వీరికోసం 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ నిర్వహణకు రిజర్వ్‌తో కలిపి 85 మంది పీఓలు, 85మంది ఏపీఓలు, 170 మంది ఓపీఓలను నియమించినట్లు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తామని తెలిపారు. 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున జంబో బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు.

గుర్తింపు కార్డు చూపించి..
గ్రాడ్యుయేట్ ఓటర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయవచ్చన్నారు. పోలింగ్ అధికారులు ఇచ్చిన పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థి పేరుకు ఎదురుగా ఏర్పాటు చేసిన జోన్‌లో ప్రిఫరెన్స్ ప్రకారం సీరియల్‌గా నంబర్లు, లేదంటే రోమన్ అంకెలు వేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు సతీష్ కుమార్, అప్పారావు, మధుసూదనరాజు, సురేష్, లక్ష్మానాయక్, ఆర్డీఓ వేణుమాధవ్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

యూనివర్సిటీని ఎంతో అభివృద్ధి చేశా

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీని ఎంతో అభివృద్ధి చేశానని, నల్లగొండ నేలను మరువలేనని ఎంజీయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పదవీ విరమణ సందర్భంగా ఎంజీయూలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పానగల్ పీజీ సెంటర్ అధ్యాపకుడిగా పనిచేసి వీసీగా బాధ్యతలు నిర్వహించడం గొప్ప అనుభూతి కలిగించిందన్నారు. సిబ్బంది కొరతను అధిగమించి కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని, నూతన భవనాలు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, అధ్యాపకులు అంజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రమేష్, ప్రేమ్‌సాగర్, మద్దిలేటి, అరుణప్రియ, సుధారాణి, రమేష్, ప్రశాంతి, రవి, నారాయణరెడ్డి, రేఖ, అన్నపూర్ణ, కేశవులు పాల్గొన్నారు.



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. బుధవారం ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. పోలింగ్‌కు 600 పోలింగ్ కేంద్రాలు, మరో 5ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు వచ్చిన 5లక్షల బ్యాలెట్ పేపర్లను సంబంధిత జిల్లాలకు పంపించామన్నారు. ఓట్ల లెక్కింపునకు నల్లగొండలోనే సంబంధిత కేంద్రంలో 96 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ చందన దీప్తి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఏఆర్వోలు రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన నల్లగొండ కలెక్టర్

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నాం
భానుపురి(సూర్యాపేట): ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటరావు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాహుల్‌హెగ్డే, అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్ లతతో కలిసి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ సురేష్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

యూనిఫామ్ కుట్టించడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం

యూనిఫామ్ కుట్టించడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఎస్. వెంకటరావు వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తో కలిసి స్కూల్ యూనిఫామ్ కుట్టుతున్న తీరుపై సమీక్షించి మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 11,576 యూనిఫామ్ కుట్టించినట్లు తెలిపారు. వచ్చేనెల 2వ తేదీలోపు వందశాతం యూనిఫామ్ కుట్టించి 41,427 మంది విద్యార్థులకు మొదటి జత పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ధాన్యం కొనుగోలు లో కూడా బాగా పనిచేశారని ట్యాబ్ ఎంట్రీ బాగా చేయడంతో రైతుల ఖాతాల్లో డబ్బులు అతి తక్కువ సమయంలో పడ్డాయని మహిళా సంఘాల సభ్యులను కలెక్టర్ అభినందించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, డీపీఎంలు, ఏపీఎంలు, స్కూల్ కో ఆర్డినేటర్లు, హెడ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి



బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి ఓటు వేయాలని సూర్యాపేట పట్టణంలోని గ్రంథాలయంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యాపేటటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజ్ఞానవంతుడు, ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌లతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడారు. అనంతరం బూత్ లెవల్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకగా నిలిచేందుకు ఉన్నత విద్యావంతుడు, సమస్యలపై పోరాడేతత్వం ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఇన్నేళ్లుగా ప్రశ్నించే గొంతుక అన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మోసగించే గొంతుకగా మారాడని ఎద్దేవా చేశారు. ఓ యూట్యూబ్ చానల్ ముసుగులో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డ మల్లన్న బాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. మల్లన్న మీద ఉన్న కేసుల్లో అత్యధికంగా మహిళలు పెట్టినవే అని పేర్కొన్నారు. అవి ఏదో ఉద్యమాల కేసులైనట్టు గొప్పగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత ఓటును బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డికి వేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు యువతను మోసగించినవేనని.. ఓ పార్టీ దేవుని పేరుతో రాజకీయాలు చేస్తుందని.. మరో పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేని పరిస్థితిలో ఉందన్నారు. అందుకే ఆరెండు పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో రిటైర్మెంట్లు

- 65 ఏళ్లు నిండిన టీచర్లు, ఆయాలకు వర్తింపు
- వివరాల సేకరణలో అధికారుల నిమగ్నం
- ఇప్పటికే 109 మంది గుర్తింపు
- వచ్చే నెల చివరినాటికి ఉద్యోగ విరమణ ప్రక్రియ పూర్తి
- వయస్సు నిర్ధారణలో కొంత అయోమయం



సూర్యాపేట నియోజకవర్గంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

భానుపురి (సూర్యాపేట): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 65 ఏళ్లు నిండిన టీచర్‌కు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో 65 ఏళ్లు నిండిన వారి వివరాలను పంపించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆదేశించింది. దీంతో జిల్లా అధికారులు వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అర్హులైన వారంతా గత నెలలోనే ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యమైంది. వచ్చే నెల చివరిలోగా అర్హులైన వారు ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం. అయితే రిటైర్‌మెంట్ బెనిఫిట్ చాలా తక్కువగా ఇస్తున్నారని కొందరు నిరాశకు గురవుతున్నారు.

1,206 అంగన్‌వాడీ కేంద్రాలు
జిల్లాలో సూర్యాపేట, చివ్వెంల, తుంగతుర్తి, హుజూర్‌నగర్, కోదాడ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1,206 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 87 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా ప్రధాన సెంటర్లలో టీచర్, ఆయా, మినీ కేంద్రాల్లో టీచర్ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల మినీ సెంటర్లలో కూడా టీచర్, ఆయాలు ఉండాల్సిందేనని ప్రభుత్వం చెప్పినా ఇంకా పోస్టులు భర్తీ చేయలేదు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ సెంటర్లలో రిటైర్మెంట్ ప్రక్రియ లేకపోవడంతో వయస్సు పైబడిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులు విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే టీచర్లు, ఆయాలు తమకు ఉద్యోగ విరమణ చేపట్టి ప్రయోజనాలు కల్పించాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేల బెనిఫిట్ కల్పిస్తామని ప్రకటించింది.

109మంది గుర్తింపు
ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో 65 ఏళ్లు పైబడిన టీచర్లు, ఆయాల వివరాలను జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 నిండాల్సి ఉండగా.. పదో తరగతి మెమో, టీసీ, బోనోఫైడ్ సర్టిఫికెట్ ఆధారంగా వయస్సును నిర్ధారిస్తున్నారు. ఇప్పటికే ఐసీడీఎస్ అధికారుల వద్ద ఎంప్లాయ్ మేనేజ్‌మెంట్ సిస్టంలో వివరాలు సైతం ఉన్నాయి. టీచర్ల వయస్సు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా.. ఆయాలు పెద్దగా చదువుకోకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎంప్లాయ్ మేనేజ్‌మెంట్ సిస్టంలో ఉన్న వివరాలకు ఆయాల ఆధార్ కార్డులో ఉన్న వివరాలకు పొంతన లేకుండా ఉంది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ సర్జన్ వద్ద నుంచి వయస్సు నిర్ధారణ పత్రాలు తేవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా అప్పటికే అధికారులు సేకరించిన వివరాల మేరకు జిల్లాలో 65 ఏళ్లు పైబడి రిటైర్మెంట్‌కు ఐదుగురు టీచర్లు, 104 మంది ఆయాలతో కలిపి మొత్తం 109 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భకులు పోటెత్తారు. శ్రీస్వామి వారి జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్ జంటనగరాలు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చారు. ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ పరిసరాలు, బస్టాండ్, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, క్యూలైన్లు వంటి ప్రాంతాలు సందడిగా మారాయి. శ్రీస్వామిని సుమారు 30వేలమందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.35,64,770 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

3.60 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం



ఆటోలో తరలిస్తున్న నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొండమల్లేపల్లి: ఆటోలో తరలిస్తున్న 3.60 క్వింటాళ్ల నల్లబెల్లం, 80 కేజీల పటికను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. వద్దిపట్లకు ఆటోలో తరలిస్తున్న నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఐడీ పార్టీ సిబ్బంది హేమునాయక్, కానిస్టేబుళ్లు రాము, భాస్కర్, హోంగార్డు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోదాడరూరల్: రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్ వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలానికి చెందిన సైదులు కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్ వద్ద కాలినడకన రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. అతడి శరీర భాగాలు లారీ కింద పడి నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

అర్వపల్లి: విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద రోజువారి కార్మికుడిగా పనిచేస్తున్న వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి శివారులో బుధవారం జరిగింది. వివరాలు.. లోయపల్లి శివారులో విద్యుత్ లూజ్‌లైన్లను రోజువారి కార్మికులచే విద్యుత్ కాంట్రాక్టర్ బుధవారం మరమ్మతులు చేయిస్తున్నాడు. మధ్యాహ్నం వరకు పనులు చేశాక ట్రాక్టర్ రాడ్డు మరమ్మతుకు గురైంది. దీంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను లూజ్ లైన్ల కింది నుంచి చెట్టు కిందకు తీసుకెళ్తుండగా.. ట్రాక్టర్ రాడ్డు విద్యుత్ లూజ్ లైన్ వైరుకు తగిలింది. దీంతో విద్యుత్ రాడ్డును పట్టుకున్న తుంగతుర్తి మండలం మంచతండా గ్రామ పంచాయతీ ఆవాసం లకుపతి తండాకు చెందిన రోజువారి కార్మికుడు లకావత్ సోమ్లా (33) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే సూర్యాపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటన జరిగినట్లు తమకు తెలిసిందని, కానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని అర్వపల్లి ఎస్ఐ యాకూబ్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ అర్బన్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ పాల్పడ్డారు. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన రవి స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా.. బుధవారం ఇంటికి తాళం వేసి రవి డ్యూటీకి వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు గమనించి ఇంటి తాళాలు పగులగొట్టి రూ.30వేలు, అర తులం బంగారం, 40 తులాల వెండి సామగ్రి ఎత్తుకెళ్లారు. సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన రవి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయంత్యుత్సవాలు పరిసమాప్తం

- ఉదయం మహా పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం
- సాయంత్రం నృసింహ ఆవిర్భావం నిర్వహించిన అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన స్వామివారి జయంత్యుత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం చేపట్టారు. ఉదయం ప్రధాన ఆలయంలో నిత్య హవనాలు, మూలమంత్ర జపములు, లక్ష్మీసూక్త, విష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలోని యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపించారు.

విశేషంగా సహస్ర కలశాభిషేకం..

ఆలయ ముఖ మండపంలో సహస్ర కలశాలను వరుస క్రమంలో పేర్చి అందులో శుద్ధ జలం, సుగ్రంధ ద్రవ్యాలు, పండ్ల రసాలను నింపారు. వాటికి దేవాదయశాఖ కమిషనర్ హనుమంతరావు దంపతులు, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ప్రధానాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆ తర్వాత ఆగమ శాస్త్ర ప్రకారం, వేద మంత్రాలతో స్వయంభూలకు సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించారు.



ప్రాకార మండపం నుంచి ఆలయంలోకి ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న అర్చకులు

సాయంత్రం నృసింహ ఆవిర్భావం..

సాయంత్రం ఆచార్యులు లక్ష్మీనరసింహస్వామిని అలంకరించి నృసింహ జయంతి, నృసింహుడి ఆవిర్భావ మహోత్సవాన్ని జరిపించారు. తన భక్తుడైన ప్రహ్లాదుడి మాటను సత్యం చేయుటకు ఆవిర్భవించిన నృసింహ అవతార విశిష్టతను భక్తులకు ఆచార్యులు తెలియజేశారు. నృసింహ ఆవిర్భావ ప్రవచనం అనంతరం నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ నీరాజనం చేసి ఉత్సవాలను సమాప్తి గావించారు. ఉదయం, సాయంత్రం ఆలయ మాడ వీధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

పాతగుట్టలో..

యాదాద్రీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సైతం స్వామివారి జయంత్యుత్సవాలను పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆచార్యులు జరిపించారు. ఉదయం ఆలయంలో పూర్ణాహుతి, అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. రాత్రి నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి గావించారు. ఆయా వేడుకల్లో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.



అద్దాల మండపంలో నృసింహుడి ఆవిర్భావ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

నేటి నుంచి ఆర్జిత సేవలు పునః ప్రారంభం..

నృసింహుడి జయంత్యుత్సవాల సందర్భంగా రద్దు చేసిన శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలను గురువారం నుంచి పునః ప్రారంభించనున్నారు.

రేవంత్‌రెడ్డిది వాయిదాల ప్రభుత్వం

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె. లక్ష్మణ్

సాక్షి,యాదాద్రి: అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాయిదాల ప్రభుత్వంగా మారిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం భువనగిరిలోని ఎంఎస్ఆర్ గార్డెన్‌లో ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రభుత్వం తెచ్చిన 317 జీఓ, ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసే గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల పక్షాన పోరాడే బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. అనంతరం కె. లక్ష్మణ్‌ను బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బూర నర్సయ్యగౌడ్ సన్మానించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్ గుప్తా, ఎన్నం శివకుమార్, ఊట్కూరి అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, బూరుగు మణికంఠ తదితరులున్నారు.



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, బూర నర్సయ్యగౌడ్

యాదాద్రిలో లక్ష్మణ్ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ బుధవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభు ప్రతిష్ఠ అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, పాపారావు తదితరులు ఉన్నారు.

సీపీఎం సీనియర్ నేత అనంతరామశర్మ మృతి



అనంతరామశర్మ(ఫైల్)

నల్లగొండ టౌన్ : స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఎం సీనియర్ నేత పెన్నా అనంతరామశర్మ (90) బుధవారం రాత్రి నల్లగొండ పట్టణంలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పిట్టంపల్లిలో జన్మించిన అనంతరామ శర్మ చిన్నప్పటినుంచి ప్రగతిశీల భావాలతో పెరిగారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం వైపు మళ్లారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి అనంతరం సీపీఎంలో కీలక నేతగా ఎదిగారు. దండంపల్లి గ్రామ సర్పంచ్‌గా రెండు దశాబ్దాలకు పైగా సేవలందించారు. రైతు వ్యవసాయ కార్మిక కార్మిక ఉద్యమాల్లో కీలక భూమిక పోషించారు. నల్లగొండ జిల్లాలో సీపీఎం విస్తరణ కోసం కృషి చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షనర్ల సంఘం కన్వీనర్‌గాను వ్యవహరించారు. ఆయన తీవ్ర వయోభారంతోనూ ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం సాయంత్రం టీవీ చూస్తూ గడిపిన అనంతరామ శర్మ హఠాత్తుగా మృతిచెందారు. అనంతరామ శర్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సింగపూర్‌లో ఉన్న ఆయన చిన్న కుమారుడు వచ్చాక అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిసింది.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెన్నా అనంతరామ శర్మకు నివాళి

పెన్నా అనంతరామశర్మ పార్థీవ దేహాన్ని పలువురు సీపీఎం నాయకులు సందర్శించి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, సయ్యద్ హాషం, సలీం, దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి తదితరులు నివాళులర్పించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డిలు అనంతరామశర్మకు సంతాపం తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

యాదాద్రిలో సంప్రదాయ దుస్తులపై ప్రచారం



దేవస్థానంలో ఏర్పాటు చేయనున్న ఫ్లెక్సీ

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జూన్ 1వ తేదీ నుంచి భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని, ఇందుకు సంబంధించి భక్తులకు అవగాహన కల్పించేందుకు గాను యాదాద్రి ఆలయంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఆలయాధికారులు, సిబ్బంది వాట్సాప్ స్టేటస్ పెట్టుకుంటున్నారు.

బెదిరించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

చౌటుప్పల్: తన కుమార్తెను కిడ్నాప్ చేశామని, అడినంత డబ్బులు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఫోన్‌లో బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ పట్టణానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ బుధవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు.. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన శ్రీనివాస్ కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తె ఢిల్లీలో, మరో కుమార్తె హైదరాబాద్‌లో చదువుతున్నారు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి శ్రీనివాస్‌కు వాట్సాప్ కాల్ చేసి తాను సీబీఐ డీఎస్పీనని హిందీలో పరిచయం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో చదువుతున్న శ్రీనివాస్ కుమార్తె రుషికశ్రీ ప్రస్తుతం తమ వద్దనే ఉందని తెలిపాడు. ఆమెను విడిచి పెట్టాలంటే రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేని పక్షంలో ఆమెను ఢిల్లీకి తీసుకెళ్తానని హెచ్చరించాడు. ఆందోళనకు గురైన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరు కుమార్తెలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇద్దరు క్షేమంగానే ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు. అసలు తమ కుమార్తె పేరు ఆగంతకుడికి ఎలా తెలుసందోనని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఆగంతకుడిపై శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

నల్లగొండ టూటౌన్: ఉద్యోగులు, నిరుద్యోగులు బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని జిల్లా గ్రంథాలయం, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో బీజేపీ జిల్లా నాయకులతో కలిసి ఆమె పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యావంతులంతా ఓటు ఎవరికి వేస్తే ఉపయోగం ఉంటుందో ఆలోచించి వేయాలని, 40 సంవత్సరాలుగా పార్టీ సిద్ధాంతం, ప్రజలకోసం పోరాడుతున్న ప్రేమేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించుకోవాలన్నారు. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మాటతప్పారన్నారు. అనుభవం లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నోటిఫికేషన్ వేయకుండానే 30వేల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, 2లక్షల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు సమాధానం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టులేదని దీనిపై కాంగ్రెస్ పెద్దలు ఆలోచించుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి పోటీలో ఉన్న వారు గతంలో బీజేపీ నుంచి వెళ్లిన వారే అని, కాంగ్రెస్ అభ్యర్థికి కాంగ్రెస్ వారినే విమర్శించిన చరిత్ర ఉందన్నారు. సమావేశంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాసగౌడ్, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు, సాధినేని శ్రీనివాస్, కళ్యాణ్‌నాయక్, పోతెపాక లింగయ్య, గడ్డం మహేష్, తదితరులు పాల్గొన్నారు.




నల్లగొండ జిల్లా గ్రంథాలయంలో ప్రచారం చేస్తున్న డీకే అరుణ, బీజేపీ నాయకులు

బంగారం దొంగిలించిన మహిళ అరెస్ట్

కోదాడరూరల్: బస్టాండ్‌లో ప్రయాణికురాలి నుంచి బంగారం చోరీ చేసిన మహిళను కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 4వ తేదీన మునగాల మండలం తిమ్మారెడ్డిగూడేనికి చెందిన తిమ్మారెడ్డి వరమ్మ మునగాల నుంచి కోదాడకు వెళ్లింది. అక్కడి నుంచి చింత్రియాలకు వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు ఎక్కి కూర్చున్న ఆమె కొద్దిసేపటి తర్వాత తన బ్యాగు చూసుకోగా అందులో ఉన్న రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే కోదాడ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం కోదాడ పట్టణంలోని గోల్డ్‌షాప్ బజారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కావలి మండలం బుడగుంట గ్రామానికి చెందిన కర్రెద్దుల లలితను అదుపులోకి తీసుకొని విచారించగా ఆమె చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆమె వద్ద నుంచి చోరీ చేసిన బంగారంతో పాటు రూ.30వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆమెపై ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో 50కి పైగా కేసులు ఉన్నాయని, పలుసార్లు జైలు జీవితం గడిపినట్లు పేర్కొన్నారు. నిందితురాలని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పట్టణ సీఐ రంజిత్‌రెడ్డి, సిబ్బంది సతీష్, యల్లారెడ్డిని సీఐ అభినందించారు.

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్

మిర్యాలగూడ: పట్టణానికి చెందిన డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్‌కు డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు అమెరికన్ ఈస్ట్‌కోస్ట్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ పవన్ కుమార్‌భూట్, డాక్టర్ కె. గంజాం తెలిపారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో మునీర్ అహ్మద్ షరీఫ్‌కు డాక్టరేట్ అందుకోనున్నారు. మునీర్ అహ్మద్ షరీఫ్‌కు డాక్టరేట్ ప్రదానం చేయడం పట్ల జనయేత్రి ఫౌండేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



మునీర్ అహ్మద్ షరీఫ్

నీటి నిల్వపై అవగాహన కలిగి ఉండాలి

- రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉషా




కొండూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉషా

మర్రిగూడ: పంటల సాగుకు కావాల్సిన నీటి నిల్వపై రైతులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉషా అన్నారు. బుధవారం మర్రిగూడ మండలం యరగండ్లపల్లి, కొండూరు గ్రామాల్లో కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి ఆమె వెళ్లి పనికి తగిన వేతనం, పనుల ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలోని ప్రతి అంశంపై కూలీలు, రైతులకు అవగాహన కలిగి ఉండి వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వచ్చే వర్మీ కంపోస్ట్‌తో రైతులకు ఎంతో లాభదాయకమన్నారు. హార్టికల్చర్ ద్వారా రైతులు పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టవచ్చాన్నారు. ఈ పథకంలో ఏర్పాటు చేసిన నర్సరీలు, క్రీడా ప్రాంగణంతో పాటు పలు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర హార్టికల్చర్ ప్రత్యేక అధికారి శరత్ బాబు, దేవరకొండ క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీఓ జి. చినమునయ్య, ఎంపీఓ బి. రవికుమార్, ఏపీఓ జి. వెంకటేశం, ఈసీ వివేక్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.


భర్త మృతదేహంతో భార్య ఆందోళన

యాదగిరిగుట్ట: తన భర్త మృతికి కారణమైన వ్యక్తిని శిక్షించాలని ఓ మహిళ తన పిల్లలు, బంధువులతో కలిసి ఆందోళన చేపట్టింది. ఈ ఘటన యాదగిరిగుట్ట పట్టణంలోని సుభాష్‌నగర్‌లో బుధవారం జరిగింది. వివరాలు.. యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్ మంగళవారం బైక్‌పై యాదగిరిగుట్టకు వెళ్తుండగా.. సైదాపురం గ్రామ శివారులో యాదగిరిగుట్ట పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన జల్లా భరత్ బైక్‌పై వెనుక నుంచి వేగంగా వచ్చి శ్రీనివాస్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తన భర్త మృతికి కారణమైన జల్లా భరత్‌ను శిక్షించి తమకు న్యాయం చేయాలని అతడి ఇంటి ముందు మృతుడి భార్య మహేశ్వరి తన ముగ్గురు పిల్లలు, కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి బుధవారం శ్రీనివాస్ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట ఎస్ఐ ఉదయ్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని సాధువెల్లికి తీసుకెళ్లారు.



ఆందోళన చేస్తున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం



శృతి (ఫైల్)

తుర్కపల్లి: కుటుంబ కలహాలతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన తుర్కపల్లి మండలం రుస్తాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తాపూర్ గ్రామానికి చెందిన మొగిరెడ్డి రాజిరెడ్డితో భువనగిరి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శృతి(32)కి 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. రాజిరెడ్డి గ్రామంలో వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తుండేవాడు. రాజిరెడ్డి మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో శృతి ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకొని ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి గుండ్ల అయోధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ కొండల్‌రావు పరిశీలించారు.

ఎర్రవరం ఆలయం వద్ద ఉద్రిక్తత

- ఆలయ చైర్మన్ తమను కులం పేరుతో దూషించాడని పండుస్వామి కుటుంబ సభ్యుల ఆరోపణ

కోదాడరూరల్: కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం శ్రీదూళ్లగుట్ట బాలఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారికి నైవేద్యం, పసుపు కుంకుమ తమ ఇంటి నుంచి తీసుకొస్తామని పండుస్వామి కుటుంబ సభ్యులు ఆలయ చైర్మన్ నలజాల శ్రీనివాసరావును ఫోన్‌లో అడిగారు. దీంతో అతను ఆలయ కమిటీ సభ్యులందరినీ అడిగి చెప్తానని చెప్పి కాల్ కట్ చేయడం మర్చిపోయాడు. అయితే శ్రీనివాసరావు 'వారి ఇంటి వద్ద నుంచి నైవేద్యం, పసుపు కుంకుమ రావడం ఏమిటని' అంటూ కులం పేరుతో దుర్భాషలాడడని, ఇదంతా తాము ఫోన్‌లో విన్నామని పండుస్వామి కుటుంబ సభ్యులు ఆలయం వద్దకు వచ్చి ఆయనతో గొడవకు దిగారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, గ్రామ పెద్దలు ఆలయ వద్దకు చేరకుని ఇరువురిని అక్కడి నుంచి పంపించారు. అనంతరం పూజా కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఈ ఘటనపై ఆలయ చైర్మన్ నలజాల శ్రీనివాసరావును వివరణ కోరగా.. తాను ఎవరినీ కులం పేరుతో దూషించలేదని, కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకం



శ్రీనివాస్

హుజూర్‌నగర్: పాన్ ఇండియా నేషనల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన మొదటి ఫెడరేషన్ కప్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీల్లో హుజూర్‌నగర్‌కు చెందిన పోలేపల్లి(శిల్ప) శ్రీనివాస్ పాల్గొని కాంస్య పతకం సాధించాడు. తెలంగాణ రాష్ట్రం తరఫున 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ పోటీలో పాల్గొని కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన పి. పాండురంగారావు, లక్ష్మీ ఆధ్వర్యంలో స్విమ్మింగ్‌లో శిక్షణ పొందినట్లు ఆయన చెప్పారు. శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు

వానాకాలం నుంచే ఉచిత పంటల బీమా

- నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్
- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అవగాహన సదస్సు

నల్లగొండ అగ్రికల్చర్: వానాకాలం నుంచే రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఉచిత పంటల బీమా పథకంపై బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులను ప్రోత్సహిస్తూ.. భరోసా కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా ఉచిత పంటల బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో వానాకాలంలో వరి, పత్తి, టమాట, కంది పంటలకు, యాసంగిలో వరి, వేరుశనగ పంటలకు ఉచిత బీమా పథకం వర్తిస్తుందన్నారు. రైతులు వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద తాము వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. రైతు ఒక పంట వేసి మరోపంట నమోదు చేసుకుంటే బీమా వర్తించదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువులతో నష్టం జరిగినా బీమా వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉచిత పంట బీమా పథకం విధివిధానాలు క్షేత్రస్థాయిలో అవలంబించాల్సిన విధానాలపై వ్యవసాయాధికారులకు, ఎంపిక చేసిన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్ డీడీ శేఖర్‌రెడ్డి, ఏడీ సుధాకర్‌బాబు, యాదాద్రి జిల్లా డీఏఓ అనురాధ, ఉద్యానవనశాఖ అధికారి సంగీత లక్ష్మీ, ట్రైనర్ సుమన్‌రామన్, ఉమ్మడి జిల్లా వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నల్లగొండ డీఏఓ శ్రవణ్‌కుమార్